వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 04 | సంచిక : 68
పేజీలు : 08 | వెల: రూ.5/-
గురువారం
నవంబర్ 28, 2024
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net



8లో..

ఫుడ్ పాయిజన్ వెనుక..
## రాజకీయ కుట్ర

- వరుస ఘటనల బాధ్యులను త్వరలోనే గుర్తిస్తాం
- అధికారుల ప్రమేయం ఉంటే ఉద్యోగం ఊస్ట్
- మంత్రి సీతక్క సంచలన వ్యాఖ్యలు




# తెలంగాణపై కమలం ఫోకస్

వివరాలు 2లో..

- తొలుత స్థానిక, జీహెచ్ఎంసీ పీఠంపై గురి
- పార్టీ సంస్థాగత బలోపేతంపై ప్రత్యేక దృష్టి
- 'ఆపరేషన్ ఆకర్ష్'పై నజర్
- కాంగ్రెస్ సర్కారే టార్గెట్ గా పావులు..
- హామీల అమలు, వైఫల్యాలపై జనంలోకి వెళ్లేలా కార్యాచరణ



కమల నాథుల్లో విజయోత్సాహం తొణికిసలాడుతోంది. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించడంతో ఇక బీజేపీ దృష్టి తెలంగాణపై పడింది. స్థానిక ఎన్నికలు, జీహెచ్ఎంసీ తోపాటు పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు రాజకీయ కార్యాచరణ రూపొందిస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు, జనం సమస్యలపై జంగ్ సైరన్ మోగించేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులతో సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి సర్కార్ వైఫల్యాలను జనంలోకి తీసుకెళ్లాలని సూచించినట్లు సమాచారం. ప్రజల పక్షాన పోరాటాలు చేసేందుకు బీజేపీ సైన్యం సంసిద్ధం కావాలంటూ పిలుపునిచ్చినట్లు పార్టీ వర్గాలు చెప్పకొచ్చాయి. అయితే పార్టీలో అంతర్గత కుమ్ములాటలకు తావివ్వకుండా అందరూ ఐక్యతతో ముందుకు సాగాలని, అప్పడే మనం అనుకున్న లక్ష్యం చేరుకుంటామంటూ దిశా నిర్ధేశం చేసినట్లు తెలిసింది.

-వరంగల్ వాయిస్, ప్రధాన ప్రతినిధి



8లో..

ఏసీబీ వలలో
## పీఆర్ ఏఈ

- రూ.5 వేల లంచం పుచ్చుకుంటూ అడ్డంగా బుక్



8లో..

అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్
## 7వ శాఖ ప్రారంభం

- గోపాల్ పూర్ లో ఏర్పాటు



2లో..

తలసేమియా చిన్నారుల కోసం..
## రక్తదాన శిబిరం

- ప్రారంభించిన కలెక్టర్ సత్య శారద



8లో..

## కేయూ అభివృద్ధికి కృషి

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని
- యూనివర్సిటీ సామాజిక విభాగం ఆధ్వర్యంలో సెమినార్

# తెలంగాణపై కమలం ఫోకస్



- తొలుత స్థానిక, జీహెచ్ఎంసీ పీఠంపై గురి
- పార్టీ సంస్థాగత బలోపేతంపై ప్రత్యేక దృష్టి
- 'ఆపరేషన్ ఆకర్ష్'పై నజర్
- కాంగ్రెస్ సర్కారే టార్గెట్ గా పావులు..
- హామీల అమలు, వైఫల్యాలపై జనంలోకి వెళ్లేలా కార్యాచరణ

**వరంగల్ వాయిస్, ప్రధాన ప్రతినిధి :** వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో అధికార పీఠాన్ని కైవసం చేసుకునేందుకు బీజేపీ అగ్రనాయకత్వం ఉవ్విళ్లూరుతోంది. ఇందుకు అనుగుణంగా ఇప్పటికే అంతర్గత కార్యాచరణ అమలు చేస్తోంది. తాజాగా మహారాష్ట్ర ఫలితాల జోష్‌ను తెలంగాణలో కొనసాగించేందుకు కసరత్తు ఇప్పటినుంచే ప్రారంభిస్తోంది. ఇందులో భాగంగా స్థానిక సంస్థల ఎన్నికలు, జీహెచ్ ఎంసీ ఎన్నికల్లో కాషాయ జెండా రెపరెపలాడించాలన్న పట్టుదలతో ఉంది. అదే సమయంలో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలని రాష్ట్ర పార్టీని జాతీయ నాయకత్వం ఆదేశించింది. జీహెచ్ఎంసీ ప్రస్తుత పాలకవర్గం పదవీకాలం వచ్చే ఏడాది డిసెంబరులో ముగియనుంది. పోయినసారి చేతికి అందినట్టే అంది పీఠం చేజారిపోయింది. దీంతో ఈ సారి ఎలాగైనా జీహెచ్ఎంసీలో జెండా పాతేందుకు రాష్ట్ర పార్టీ నాయకత్వం వ్యూహాత్మకంగా పావులు కదుపుతోంది. గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో అనూహ్య ఫలితాలు సాధించి మేయర్ పీఠానికి అతి చేరువలోకి వచ్చి నిలిచిపోయిన బీజేపీ.. ఈ సారి రాజధానిలో సత్తా చాటాలని, తద్వారా వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు మరింత బలపడాలని భావిస్తోంది. ఇందులో భాగంగా స్థానిక పార్టీ ముఖ్యులు, కార్పొరేటర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించింది. గ్రేటర్ పరిధిలోని అన్ని డివిజన్లలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎక్కడికక్కడ ఎండగట్టాలని, ప్రజా సమస్యలపై పోరాటాలను విస్తృతం చేయాలని నిర్దేశించింది. వీటితోపాటు ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో విస్తృతంగా ఎండగట్టేలా దీర్ఘకాలిక కార్యాచరణ రూపొందించే దిశగా అడుగులు వేస్తున్నారు.

### హైదరాబాద్ నుంచి..

గ్రేటర్ హైదరాబాద్ లో మేయర్ పీఠం కైవసం చేసుకున్న తర్వాత అన్ని జిల్లాల్లో బీజేపీ బలోపేతంపై ఫోకస్ చేయనున్నట్లు తెలిసింది. ఈ సారి జరగబోయే స్థానిక ఎన్నికల్లోనూ మెజార్టీ గ్రామాల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించేందుకు కసరత్తు చేస్తున్నారు. రాష్ట్రంలో, పట్టణ ప్రాంతాల్లో కొంత బీజేపీ ప్రభావం కనిపిస్తున్నా.. గ్రామీణ ప్రాంతాల్లో అంతంత మాత్రంగానే ఉంది. అందుకే, మారు మూల గ్రామాల్లో కమలం వికసింపజేసేందుకు పార్టీ నాయకత్వం పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోంది.



### కాంగ్రెస్ సర్కారే టార్గెట్..

రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి పాలన పట్ల జనం అసంతృప్తితో రగిలిపోతున్నారని బీజేపీ భావిస్తోంది. ప్రజలను తమ వైపు తిప్పుకోవాలంటే ప్రజా క్షేత్రంలో జంగ్ సైరన్ మోగించాలని నిర్ణయం తీసుకుంది. కాంగ్రెస్ సర్కారే టార్గెట్ గా పావులు కదుపుతోంది. అందులో భాగంగానే ఇటీవల కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మూసీ నిద్ర కార్యక్రమాన్ని చేపట్టారు. అంతేకాకుండా, ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు త్వరలో బీజేపీ రాష్ట్ర నాయకత్వం పాదయాత్రకు ప్లాన్ చేస్తున్నట్లుగా తెలుస్తోంది. అయితే, ఈ పాదయాత్ర కార్యక్రమంపై పార్టీలో భిన్నాభిప్రాయాలు ఉన్నట్లు సమాచారం. బీజేపీ పార్టీలో మరో ట్విస్ట్ నెలకొంది. ఇందులో రెండు వర్గాలు ఉన్నాయని, ఒక వర్గం ప్రభుత్వానికి అనుకూలంగా ప్రకటనలు ఇస్తోందని, మరో వర్గం ప్రతిపక్షానికి అనుకూలంగా ప్రకటనలు ఇవ్వడంతో పాటు నిర్ణయాలు అదేవిధంగా తీసుకుంటుందని చర్చ జరుగుతోంది. ఇందులో భాగంగా మోడీ బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీలను ఢిల్లీకి పిలిచి క్లాస్ పీకినట్లు సమాచారం.

### ఆపరేషన్ ఆకర్ష్..

బీజేపీ 'ఆపరేషన్ ఆకర్ష్'కు తెరతీసింది. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని బలహీనపరచడమే లక్ష్యంగా ఆ పార్టీ పావులు కదుపుతోంది. ఈ మేరకు ఈటల రాజేందర్‌తోపాటు పలువురు తెలంగాణ ప్రాంతానికి చెందిన సీనియర్ నేతలు ఇప్పటికే ఢిల్లీలో పార్టీ పెద్దలతో భవిష్యత్ కార్యాచరణపై చర్చించినట్లు సమాచారం. డిసెంబరు మొదటి వారంలోగా పార్టీలో మార్పులు, చేర్పులు జరగనున్నట్లు సమాచారం. కాగా, లోక్‌సభ ఎన్నికల టార్గెట్ ఛేదించిన బీజేపీ.. ఇక లోకల్ వార్‌లో సత్తా చాటాలని భావిస్తోంది. ఇందులో భాగంగా స్థానిక ఎన్నికల సమరానికి సై అంటూ ఉరకలేస్తోంది. ఫోకస్.. లోకల్ అనే నినాదంతో ముందుకు సాగుతోంది. కొద్ది నెలల్లో తెలంగాణలో జరగబోయే స్థానిక సంస్థల సమరానికి సమాయత్తం అవుతోంది. ఆ దిశగా పార్టీ లీడర్లు, కేడర్‌కు దిశా నిర్దేశం చేస్తోంది.

### యాక్షన్ ప్లాన్..

తెలంగాణలో బీజేపీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయడంతో పాటు లోకల్ బాడీ ఎన్నికలే టార్గెట్‌గా పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడానికి బీజేపీ అధిష్ఠానం ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సమాచారం. స్థానిక సమరంలో కమలం కేడర్ కదం తొక్కడమే లక్ష్యంగా సమాలోచనలు చేస్తున్నారు. ఇక తెలంగాణలో గల్లీ స్థాయిలో కూడా విజయం సాధిస్తామంటూ కమల నాథులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. రాబోయే స్థానిక సమరానికి కేడర్‌ని సమాయత్తం చేసే దిశగా కాషాయ పార్టీ అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగా ఇటీవల జరిగిన కార్యవర్గ సమావేశంలో నాలుగు తీర్మానాలను సైతం చేసింది. అయితే, ఇప్పుడు స్థానిక ఎన్నికల సమరంపై కాషాయ పార్టీ దృష్టి కేంద్రీకరించినట్లు కనపడుతున్నా.. భవిష్యత్తులో ఆ అడుగులు తెలంగాణలో అధికారం చేజిక్కించుకోవడమే ధ్యేయంగా పడుతున్నాయి. కమలం పార్టీ లీడర్లు, కేడర్ కూడా రేపు లోకల్ వార్, తర్వాత అసెంబ్లీ సమరం అనే వ్యూహంతో ముందుకు కదులుతున్నారు. స్థానిక ఎన్నికల్లో గెలిచి మంచి పునాది వేసుకుంటే.. తెలంగాణలో నెక్ట్స్ కమల వికాసం తథ్యమని భావిస్తున్న కాషాయ పార్టీ ఆ దిశగానే కదులుతోంది.

## తలసేమియా చిన్నారుల కోసం..
# రక్తదాన శిబిరం

- ప్రారంభించిన కలెక్టర్ సత్య శారద

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** తెలంగాణ పొదుపు, మార్కెటింగ్ పరస్పర సహాయక సహకార సంఘం లిమిటెడ్, వరంగల్ కూరగాయల మార్కెట్ వ్యాపారస్తుల సంయుక్త అధ్వర్యంలో అభయ రూరల్ డెవలప్ మెంట్ సొసైటీ వారి సహకారంతో గురువారం లక్ష్మీపురం మోడల్ కూరగాయల మార్కెట్ ప్రాంగణంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు సత్య శారదా దేవి విచ్చేసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించడంతోపాటు రక్తదాతలకు సర్టిఫికెట్లు అందచేశారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా మార్కెటింగ్ శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు ఉప్పుల శ్రీనివాస్, మార్కెటింగ్ శాఖ ఉపసంచాలకులు పద్మావతి, మార్కెటింగ్ శాఖ అధికారి సురేఖ, ఎనుమాముల ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలేపాక నిర్మల, ఛాంబర్ అఫ్ కామర్స్ అధ్యక్షులు బొమ్మినేని రవీందర్ రెడ్డి, రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ విజయ్ చందర్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్ పాల్గొని రక్తదాతలను అభినందించారు. తల సేమియా బాధిత చిన్నారులకోసం ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బిట్ల కృష్ణ, తెలంగాణ పొదుపు, మార్కెటింగ్ పరస్పర సహాయక సహకార సంఘం లిమిటెడ్, వరంగల్, అభయ రూరల్ డెవలప్ మెంట్ సొసైటీ సభ్యులు, రక్తదాతలు, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా ఏవీవీ వ్యవస్థాపక దినోత్సవం

**పాల్గొన్న ప్రముఖులు, పూర్వ విద్యార్థులు**





**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఏవీవీ విద్యా సంస్థల వ్యవస్థాపక జన్మ దినోత్సవ వేడుకలను గురువారం కళాశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభానికి ముందే ఇక్కడికి చేరుకున్న ముఖ్య అతిథి, ఏవీవీ పూర్వ విద్యార్థి, పదవీ విరమణ పొందిన ఐఏఎస్ అధికారి డి.చక్రపాణి ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, డిగ్రీ, పీజీ కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందంతో ఒకసారి, విద్యార్థులతో మరోమారు పరస్పర అవగాహన చర్చా కార్యక్రమాన్ని నిర్వహించి వారి సుదీర్ఘ అనుభవాన్ని అందరికీ అర్థమయ్యేలా, వారి ఉజ్వల భవిష్యత్ నిర్మాణానికి ఉపయోగపడే అద్భుతమైన సలహాలు, సూచనలను అందచేశారు. తదనంతరం నిర్వహించిన వ్యవస్థాపక జన్మ దినోత్సవ వేడుకల కార్యక్రమంలో కుమారి అనన్య అతిథులను వేదికపైకి ఆహ్వానించగా అతిథులచే జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఏవీవీ సంఘ అధ్యక్షులు డాక్టర్ నరసింహారావు మాట్లాడుతూ చందా కాంతయ్య అడుగు జాడల్లో నడవాలని విద్యార్థులను కోరారు. విద్యా సంస్థల కార్యదర్శి, కరస్పాండెంట్ డాక్టర్ చందా విజయ్ కుమార్ మాట్లాడుతూ ఎన్నో వ్యయప్రయాసలకోర్చి ఈ విద్యా సంస్థను స్థాపించారని గుర్తు చేశారు. సంస్థ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తున్నామని, పేద విద్యార్థుల మనుగడకు ఎప్పుడూ ముందుంటున్నామన్నారు. ఏవీవీ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ వి.వెంకటేశ్వర రావు మాట్లాడుతూ ఏవీవీ విద్యా సంస్థలో చదవడం విద్యార్థుల అదృష్టమన్నారు. ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భుజేందర్ రెడ్డి మాట్గాడుతూ విద్యాపరంగా, మానసికంగా, వైజ్ఞానికంగా విద్యార్థులు ఎదగాలని అందుకు ఈ నీడ ఎప్పుడూ తోడుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏవీవీ పూర్వ విద్యార్థి డి.చక్రపాణిని భౌతిక శాస్త్ర అధ్యాపకులు ఎస్.సంజీవ సభకు పరిచయం చేశారు. డాక్టర్ ఎస్.అనిత వందన సమర్పణతో కార్యక్రమాలు ముగిసాయి. ఈ కార్యక్రమంలో ఏవీవీ సంఘ యాజమాన్య శాశ్వత సభ్యులు చందా శ్రీకాంత్, సభ్యులు చకిలం మదన్ మోహన్ రావు, ప్రొఫెసర్ ఎస్ఎస్ వివన్ శర్మ, జి.మురళీ మోహన్, ఆచార్య చందా కుటుంబ సభ్యులు, ఏవీవీ ఉన్నత పాఠశాల అకాడమిక్ కోఆర్డినేటర్ వాసుదేవులు, పురప్రముఖులు, పూర్వ అధ్యాపకులు, ఉపాధ్యాయులు, పాత్రికేయులు, విద్యా సంస్థల సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# గ్రంథాలయాలకు పూర్వ వైభవం తీసుకు రావాలి

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ గా అజీజ్ ఖాన్ ప్రమాణ స్వీకారం
- హాజరైన ఎమ్మెల్యే లు నాయిని, నాగరాజు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ గా గురువారం మొహమ్మద్ అజీజ్ ఖాన్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా అజీజ్ ఖాన్ కు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. మొదటగా గ్రంథాలయంలో సరస్వతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానికంగా ఏర్పాటు చేసిన సభలో ప్రమాణ స్వీకారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సభను ఉద్దేశించి ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ ప్రపంచంలో మేధో శక్తిని పెంపొందించాలంటే, మేధావులను తయారు చేయాలన్న గ్రంథాలయాలు వారధిగా ఉంటాయి. ప్రస్తుత సమాజంలో ఇంటర్నెట్ కాలంలో గ్రంథాలయాలకు ఆదరణ కరువైంది. నూతన చైర్మన్ గా ఎన్నికైన అజీజ్ ఖాన్ గ్రంథాలయాలకు పూర్వవైభవం తీసుకు రావాలని కోరారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలో రావడానికి కృషి



చేసిన ప్రతి ఒక్కరికి సమయానుకూలంగా సముచిత స్థానం కల్పించే బాధ్యత నాది అని ఎమ్మెల్యే నాయిని పేర్కొన్నారు. గతంలో నేను చైర్మన్ ఉన్నప్పుడు గ్రంథాలయాల్లో ఇంటర్నెట్ (వైఫై ) సేవలను ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట శాసనసభ్యులు కే ఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వారాజు సారయ్య , వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎర్రబెల్లి స్వర్ణ , రాష్ట్ర నాయకులు దొమ్మటి సాంబయ్య, కుడా చైర్మన్ ఇనిగాల వెంకట్ రామ్ రెడ్డి, రాష్ట్ర గ్రంథాలయం సంస్థ చైర్మన్ రియాజ్, కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, అభిమానులు, అధికారులు పాల్గొన్నారు.

### శుభాకాంక్షలు తెలిపిన కుడా చైర్మన్..

జిల్లా గ్రంథాలయం సంస్థ నూతన చైర్మన్ గా నియమితులైన మొహమ్మద్ అజీజ్ ఖాన్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో కలిసి కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ గా నియమితులైన అజీజ్ ఖాన్ కు శాలువలతో సన్మానించిన అనంతరం కుడా చైర్మన్ మాట్లాడుతూ అందరికీ ఉపయోగపడేలా గ్రంథాలయాలు ఉండాలనేది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయమన్నారు. గ్రంథాలయాలలో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉండేలా కృషి చేయాలన్నారు.

# సాయిబాబా మందిరంలో రక్తదానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్థానిక సాయిబాబా మందిరంలో ఎంజీఎం రక్తనిధి డాక్టర్ ఆశా దేవి ఆధ్వర్యంలో మందిర వైద్యులు ఆకుల వెంకట రమణయ్య పర్యవేక్షణలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. భక్తులు ఉత్సాహంగా ఈ శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. మందిర చైర్మన్ మతుకుమల్లి హరగోపాల్ రక్తదాతలకు ప్రశంసా పత్రాలు అందజేయగా ధర్మకర్తలు నిమ్మల శ్రీనివాస్, రాకం సదానందం, వెయ్యి గండ్ల రమేష్, డాక్టర్ పూస సురేష్ కుమార్ తదితరులు పాల్గొనగా, బ్లడ్ మోటివేటర్ మహేష్, ఎంజీఎం వైద్య సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# గ్రంథాలయం ప్రారంభం



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలంలోని చింత నెక్కొండ గ్రామంలో మహాత్మజ్యోతి బాపూలే వర్ధంతి సందర్భంగా నెక్కొండ గ్రామీణ హితకారిణి సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గటిక మల్లయ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మహాత్మ జ్యోతిబాపులే చారిటబుల్ ట్రస్ట్ ,గ్రంథాలయాన్ని పర్వతగిరి మండల తహసిల్దార్, టి వెంకటస్వామి, ఎంపీడీవో శంకర్ గురువారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ గ్రంథాలయాలు ఆలోచనా విధానం, జ్ఞానం పెంపొందించుకునేందుకు దోహదపడుతాయన్నారు. పుస్తకాలు చదవడం, రాయడం ఎంతో లాభదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కందిక చెన్నకేశవులు, దబ్బేట యాలాద్రి, బోనాల సాంబయ్య, పల్లెపాటి రామచంద్రరావు, సంగినేని ధర్మారావు, పర్వతం ఎల్ల స్వామి, యుద్ధం దూడయ్య, నాగలి ఉప్పలయ్య, చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాధికారంలోకి ఉత్పత్తి శక్తులు రావాలి

- ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** రేపు, ఎల్లుండి రెండు రోజుల పాటు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరుల పురిటిగడ్డ చిట్యాల అయిలమ్మ, దొడ్డి కొమురయ్యలు నడియాడిన జనగామ జిల్లా పాలకుర్తి శుభం పంక్షన్ హల్ లో ఎంసీపీఐ(యూ) తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశాలు జరుగుతున్నాయని, ఈ సమావేశాలు విజయవంతం చేయాలని ఎంసీపీఐ(యూ) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి పిలుపునిచ్చారు. వరంగల్ జిల్లా కార్యాలయం ఓంకార్ భవన్ నుంచి విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఈ సమావేశం ఉత్పత్తి శక్తులైన కష్టజీవులు రాజ్యాధికారంలోకి వచ్చినపుడు మాత్రమే సంపద సమాన పంపిణీ జరుగుతుందని తెలిపారు. అప్పుడు మాత్రమే సమాజంలో అసమానతలు రూపుమాపడానికి మార్గం ఏర్పడుతుందని, ఇందు కోసం ఎంసీపీఐ(యూ) నిరంతరం కృషి చేస్తున్నదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అందుకోసం నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రంలో రాజకీయ ప్రత్యామ్నాయంగా బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) ఏర్పడి పని చేస్తుందని, గత శాసనసభ ఎన్నికల్లో ఏ పాలకవర్గ పార్టీతో పొత్తు లేకుండా ప్ర త్యా మ్నా యం గా పోటీ లో నిలిచిందని, ఇదే సరైన మార్గమని ఎం సీ పీ ఐ ( యూ ) విశ్వసిస్తూ అందుకు కలిసి వచ్చే శక్తులతో కలిసి రాజ్యాధికారం కోసం కృషి చేస్తున్నదన్నారు. రాజ్యాధికారం కోసం ప్రజా పోరాటాలకు సమాయత్తం కావడానికి ఈ రాష్ట్ర కమిటీ సమావేశంలో నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందన్నారు.



# స్టడీ మెటీరియల్ పంపిణీ



**వరంగల్ వాయిస్, కాటారం :** స్వయంకృషి సేవా సంస్థ ఆధ్వర్యంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ధన్వాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్, పరీక్ష ప్యాడ్లలను శంకరంపల్లి వాసి డాక్టర్ అంగజాల కిషోర్ సహకారంతో అందజేశారు. ఈ కార్యక్రమంలో సభాధ్యక్షుడు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, స్వయంకృషి ఫౌండర్ కొట్టే సతీష్, శంకరపల్లి మాజీ సర్పంచ్ అంగజాల అశోక్ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులుగా విద్యార్థులు పట్టుదలతో చదివి మీ తల్లిదండ్రులకు చదువు నేర్పిన గురువులకు జన్మనిచ్చిన ప్రాంతానికి గొప్ప పేరు తీసుకురావాలన్నారు. విద్యార్థులే దేశానికి పట్టుకొమ్మలు అని, దేశాభివృద్ధిలో భాగ్యస్వామ్యం కావాలని, విద్యార్థులు అన్ని అవకాశాలను వినియోగించుకొని ఉన్నత శిఖరాలను అందుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కొండ్రు శివ, బోడ శ్రీధర్, చిటూరి రాజేష్, గొనె మహేష్, రాజునాయక్, రెడ్డిపల్లి రవి, విడిదినేని ప్రభుదేవా, ఆకుల చంటి, పాఠశాల సిబ్బంది, స్వయంకృషి సభ్యులు హైమద్, శేఖర్, రవి, రాజశేఖర్ పాల్గొన్నారు.

# దీక్షా దివస్ ను విజయవంతం చేయాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా కేంద్రంలో రేపు నిర్వహించే దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దీక్ష దివాస్ జిల్లా ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వర్ రావు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు, తెలంగాణ ఉద్యమకారులకు పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో రేపు జరిగే దీక్షా దివస్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని పట్టణంలోని మాజీ ఎంపీ క్యాంప్ కార్యాలయంలో గురువారం బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నేతలు, ప్రజా ప్రతినిధులతో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో కొండబాల మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం తెలంగాణ వచ్చుడో... కేసీఆర్ సచ్చుడో అనే నినాదంతో కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరహార దీక్షతో తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని, తెలంగాణ సమాజాన్ని ఐక్యం చేసిన సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ మరోసారి ఆస్ఫూర్తిని ప్రజల్లో నింపాలన్నారు. రేపటి దీక్ష దివస్ ను విజయవంతం చేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే నేతలకు భరోసా ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే రెడ్యా నాయక్, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు కొండబాల కోటేశ్వర్ రావు, దీక్షా దివస్ జిల్లా ఇంచార్జి పాల్గొన్నారు.

# రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ కు సన్మానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ జిల్లా టీఎన్జీఓస్ యూనియన్ అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘాల నేతలు రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్ ను జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షులు పుల్లూరు వేణు గోపాల్, కోశాధికారి పనికేల రాజేష్, కేంద్ర సంఘం నాయకులు శ్యామ్ సుందర్, కత్తి రమేష్, రాము నాయక్, మొయిజ్ జిల్లా బాధ్యులు ఎర్రప్రగడ, ప్రణయ్, పృథ్వీ, మన్సూర్, పురుషోత్తం రాజు, రాజేంద్ర ప్రసాద్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పూలేకు ఘన నివాళి



**వరంగల్ వాయిస్, పరకాల :** స్థానిక మునిసిపల్ పరిధిలోని పెద్దరాజీపేట 6వ వార్డులో గురువారం ఉదయం 10:00 గంటలకు పరకాల పట్టణ ప్రముఖ కాంగ్రెస్ పార్టీ నాయకులు మడికొండ బ్రదర్స్ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన ఒకటో వార్డు కౌన్సిలర్ మడికొండ సంపత్ కుమార్ మాట్లాడుతూ సమాజంలో కులవివక్ష, అంటరానితనంపై పోరాటం చేసి, వెనుకబడిన బడుగు, బలహీన వర్గాలకు హక్కులు, మహిళలకు విద్యవకాశం కల్పించిన గొప్ప సంఘసంస్కర్త మహాత్మ జ్యోతిరావు పూలే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మడికొండ శ్రీను, కోడెపాక అమర్, బొజ్జం సాయి, మరుపట్ల మహేష్, 6వ వార్డు ప్రజలు, యువకులు గొడుగు రమేష్, బండి రామన్న, మోతే రాజయ్య, సిక్కుల రాజు, పెండెల ఓదెలు, మోతే పెద్ద రాజయ్య, బోయిని సురేష్, సూర తిరుపతి, సూర ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

## బీసీ కుల సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో..



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మహాత్మా జ్యోతి బాపూలే వర్ధంతి సందర్భంగా బీసీ కుల సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఎస్ డీఎల్ సీ పరిధిలో ఉన్న పూలే విగ్రహానికి బీసీ కుల సంఘాల ఐక్యవేదిక ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు బింగి శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వలబోజు శ్రీనివాస్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీకుల సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు పాశికంటి రాజేంద్రప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుగు సురేష్, జిల్లా ఉపాధ్యక్షుడు అడ్వకేట్ చిందం సుధీర్, కార్యవర్గ సభ్యుడు పెనుమల్ల భరత్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కుల సంఘాల ఐక్యవేదిక ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు బింగి శ్రీనివాస్ మాట్లాడుతూ మహాత్మ జ్యోతిబాపూలే భారతదేశపు ఆధునిక యుగ వైతాళికుడని కొనియాడారు.

## కరీమాబాద్ లో..



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** వరంగల్ ఉర్సు దర్గా ప్రాంతంలో పూలే వర్ధంతి కార్యక్రమాన్ని పూలే విగ్రహ వ్యవస్థాపకుడు చీర భరత్, ఆడేపు నగేష్ ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి పాల్గొని పూలేకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వనం కుమార్, వంగరి సురేష్, అంబేద్కర్ మహాసేన రాష్ట్ర అధ్యక్షుడు సంతోష్, మాజీ కార్పొరేటర్ తాళ్ల ఉమాదేవి, అంకం వెంకటేశ్వర్లు, అడుప శ్యాంసుందర్, టీంగిలి కారి రాజు, ఆవునూరి రాజమల్లు, కొత్తగట్టు భాస్కర్, లక్కా సురేందర్, మూసిపట్ల గిరిధర్, ఆకుతోట సదానందం, దాసరి శంకర్, ఎస్ కే గౌస్ పాల్గొన్నారు.

# బీసీలకు అన్ని రంగాల్లో అన్యాయం

**➲ రిటైర్డ్ ప్రొఫెసర్ గడ్డం భాస్కర్**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** "దేశంలో గత 75 ఏళ్లుగా బీసీలు పూర్తిగా అన్నిరంగాల్లో అన్యాయానికి గురయ్యారని బీసీ ఇంటలెక్చువల్ ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్, రిటైర్డ్ ప్రొఫెసర్ గడ్డం భాస్కర్ అన్నారు. మహాత్మా జ్యోతిబా పూలే 134 వర్ధంతి సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంటరాని కులాలకు వారి జనాభాకు అనుగుణంగా రాజ్యాంగ ప్రకారం 15 శాతం ఎస్సీ రిజర్వేషన్ కల్పిచండానికి అంబేద్కర్ కృషి చేశారు. కానీ, బీసీలకు ఆరకంగా ప్రాతినిధ్యం వహించిన నాయకులు రాజ్యాంగ పరిషత్ లో లేనందున తీరని అన్యాయం జరిగిందన్నారు. ఆర్టికల్ 340 ప్రకారం బీసీలను వెనకబడిన తరగతులని పేర్కొనడం వల్ల తీరని అన్యాయం జరిగిందన్నారు. పూలే ఆశయాలు కొనసాగించడానికి ఈ సందర్భంగా మనమందరం కంకణబద్ధలై పని చేయాలన్నారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన సుందర్ రాజ్ యాదవ్ మాట్లాడుతూ అంటరాని తనం నిర్మూలనకు, మహిళాభివృద్ధికి కృషి చేసిన మహనీయుడు జ్యోతి బాపూలే అని కొనియాడారు. ప్రజలంతా ఆయన్ని ప్రేమతో మహాత్మా అని పిలుచుకునే వారని తెలిపారు. బీసీ నాయకుడు బండ వివేకానంద మాట్లాడుతూ పూలే గులాంగిరి ' అనే గ్రంథాన్ని రాసి వెనుక



బడిన కులాల అభ్యున్నతికి కృషిచేశారని తెలిపారు. ప్రముఖ వైద్యుడు కూరపాటి రమేష్ మాట్లాడుతూ దేశంలో బీసీల తరపున మొట్ట మొదట తన వాణిని వినిపించి, తన భార్యను ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్ది మహిళా సమానత్వానికి కృసి చేసిన మహనీయుడు పూలే అన్నారు. పద్మశాలి సంఘం కార్యదర్శి వైద్యం రాజగోపాల్ మాట్లాడుతూ దేశంలో బీసీలంతా ఏకమై రాజ్యాధికారాన్ని సాధించన నాడే పూలే జీవితాశయం నెరవేరుతుందన్నారు. అనంతరం బుట్టి శ్యామ్ సుందర్ మాట్లాడుతూ మనిషికి అభివృద్ధి విద్య ద్వారానే అని చెప్పిన మొట్ట మొదటి వ్యక్తి పూలే అన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ కొంతం కృష్ణ, డాక్టర్.కే.వీరస్వామి, బగ్గి రాజు, ఎదులాపురం సనత్ కుమార్ చారి, రాజాగౌడ్, కాయిత బహ్మచారి, జి వేణుగోపాలు, లాయర్లు, డాక్టర్లు, మేధావులు, యువత, విద్యార్థులు పాల్గొన్నారు.

## పూలే ఆశయాలను కొనసాగిస్తున్నాం

**ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**



**వరంగల్ వాయిస్, బాలసముద్రం :** హనుమకొండ బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సామాజిక తత్వవేత్త, ఉద్యమకారుడు, సంఘసేవకుడు మహాత్మా జ్యోతిబా పూలే 134వ వర్ధంతి వేడుకలు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డితో కలిసి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు కృషి చేసిన గొప్ప నాయకుడు పూలే అని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రగతి భవన్ పేరు మార్చి మహాత్మా జ్యోతి బాపూలే ప్రజా భవన్ గా నామకరణం చేసి పూలే ఆశయాలను కొనసాగిస్తూ ప్రజారంజక పాలన అందిస్తున్నామని ఎమ్మెల్యే నాయిని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ మెంబర్ బత్తిని శ్రీనివాస్ రావు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కమలాపూర్ ఏఎంసీ చైర్మన్ తౌటం ఝాన్సీరాణి రవీందర్, కార్పొరేటర్ మామిండ్ల రాజు, ఎన్ఎస్ యూఐ జిల్లా అధ్యక్షుడు పల్లకొండ సతీష్, జిల్లా ఓబీసీ సెల్ చైర్మన్ బొమ్మతి విక్రమ్, వైస్ చైర్మన్ గజ్జి సాగర్, జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి లహరి, సీనియర్ నాయకులు బొంత సారంగం, శ్రీకర్, కవిత, డివిజన్ అధ్యక్షులు పల్లపు రమేష్, కుమార్ యాదవ్, శివ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

## అణగారిన వర్గాల ఆశాజ్యోతి పూలే



**వరంగల్ వాయిస్, బాలసముద్రం :** అణగారిన వర్గాల ఆశాజ్యోతి పూలే అని కుడా మాజీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్ రాజ్‌యాదవ్ అన్నారు. బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా కార్యాయలంలో గురువారం మహాత్మా జ్యోతి బాపూలే వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి కుడా మాజీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్ రాజ్‌యాదవ్, భారత జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు దాస్యం విజయ్ భాస్కర్ పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం సుందర్ రాజ్ యాదవ్ మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహనీయుడు పూలే అని కొనియాడారు. స్వాతంత్ర్యానికి మునుపే బహుజనుల జీవితాల్లో వెలుగులు నింపేది చదువే అని చాటిచెప్పి, చదువులు చెప్పిన వ్యక్తి జ్యోతి బా పూలే అని, అమ్మ సావిత్రీ బాయి పూలే సహితం మహిళల చదువుల కోసం అవిశ్రాంతంగా కృషి చేశారని అన్నారు. బీసీలు సంఘటితమై హక్కుల కోసం పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రఘు, డివిజన్ అధ్యక్షులు కోటి లింగం, నాయకులు వీరేందర్, ప్రవీణ్, రాజు, రాకేష్ యాదవ్, ప్రణయ్, శ్రీకాంత్, ఆర్ కే నరేందర్, స్నేహిత్, మహేష్, సాంబయ్య, నాగరాజు, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

# సమన్యాయం కోసం పోరాడిన సంఘ సంస్కర్త పూలే

**● పాస్ రాష్ట్ర అధ్యక్షుడు సంగని మల్లేశ్వర్**

**వరంగల్ వాయిస్, కేయూ :** దేశంలో సమన్యాయం కోసం పోరాడిన మహనీయులు జ్యోతిరావు పూలే అని పాస్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సంగని మల్లేశ్వర్ అన్నారు. గురువారం పూలే ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో కాకతీయ విశ్వవిద్యాలయం దూరవిద్యా కేంద్రంలోని పూలే ప్రాంగణంలో 134వ వర్ధంతి సందర్భంగా పాస్, రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు విచ్చేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా పాస్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సంగని మల్లేశ్వర్ మాట్లాడుతూ గాంధీజీ కంటే ముందే మహాత్మగా పిలువబడ్డ జ్యోతిరావు పూలే అంబేద్కర్ వంటి మహనీయుడికి స్ఫూర్తినిచ్చారని గుర్తు చేశారు. భారతదేశంలోని శూద్రాతి శూద్రులు బ్రాహ్మణీయ కుల వ్యవస్థలో బానిసలుగా ఉన్నారనీ, బడుగులు బానిసలుగా ఉండడానికి బ్రాహ్మ ణీయ దోపిడీ, అణచివేత, వివక్షలను అర్థం చేసుకోకపోవడం, అందుకు చదువు లేకపోవడమే మూలమని పూలే గ్రహించి ఎన్నో పాఠశాలలు ప్రారంభించారని తెలిపారు. సమాజ హితానికి పాడుతపడ్డ మహానుభావులను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని అట్టడుగు వర్గాలను కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు



ప్రొఫెసర్ ఏ. సదానందం, ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ వడ్డే రవీందర్, పాస్ రాష్ట్ర కార్యదర్శి చంద మల్లయ్య, పాస్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ నల్లాని శ్రీనివాస్, పాస్, జిల్లా ఉపాధ్యక్షులు బాబు యాదవ్, నాయకులు, ప్రొఫెసర్ ఎం సారంగపాణి, ప్రొఫెసర్ సీహెచ్ సమ్మయ్య, డాక్టర్ పులి కోటేశ్వర్, డాక్టర్ ఆకుల శ్రీనివాస్, డాక్టర్ జగన్ తదితరులు పాల్గొన్నారు.

5 WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
గురువారం, నవంబర్ 28, 2024

# దామెర విద్యార్థులకు పతకాల పంట




**వరంగల్ వాయిస్, దామెర :** హనుమకొండలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల వరంగల్ జిల్లా స్థాయి అండర్ –12 విభాగంలో బాలబాలికల అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో దామెర పాఠశాల విద్యార్థులు వరుసగా గోల్డ్ సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించి "వరంగల్ జిల్లా అథ్లెటిక్స్ లో పతకాల పంట" పండించినట్లు మండల విద్యాశాఖ అధికారి లకవాత్ రాజేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రుత్విక్ 400 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్ లో, రమ్య 100, 300 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్ లో, రుచిత, సాన్వి 50, 100 మీటర్ల పరువు పందెం, లాంగ్ జంప్ లో, అక్షర లాంగ్ జంప్, కిడ్ జావెలిన్ త్రో లోపల పాల్గొని మొత్తం 13 మెడల్స్ ను కైవసం చేసుకున్నట్లు తెలిపారు. వరంగల్ జిల్లా నుంచి రాష్ట్రస్థాయికి ఎంపికైన దామెర పాఠశాల క్రీడాకారులు డిసెంబరు 1 నుంచి మంచిర్యాలలో నిర్వహించే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొననున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న దామెర మండల విద్యాధికారి, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేష్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సబితా దేవి, నవీన్ కుమార్ ఎంపికైన క్రీడా విద్యార్థులను ఫిజికల్ డైరెక్టర్ దేవేందర్ లను అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం రాజేష్ మాట్లాడుతూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో విద్యార్థుల ఎంపికకు కృషి చేయాలని, తగిన తర్ఫీదును విద్యార్థులకు ఇవ్వాలని ఫిజికల్ డైరెక్టర్ కు సూచించారు. శ్రీలత, నవీన్, రుక్మిణి దేవి, సృజన, రమేష్ రెడ్డి, సుదక్షణాదేవి, మాధవి, రవీందర్, ఉమామహేశ్వర్ వెంకటరెడ్డి, కవిత, స్వర్ణలత, ఉపాధ్యాయులు, క్రీడాకారులను అభినందించారు.

## గురుకుల పాఠశాల సందర్శన



**వరంగల్ వాయిస్, దామెర :** నాణ్యమైన పోషక విలువలతో కూడిన ఆహారాన్ని విద్యార్థినిలకు అందించాలని ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం దామెర మండలంలోని వీడ్స్ ఇంజినీరింగ్ కాలేజీ వద్దగల ఎంజేపీ బాలికల గురుకుల పెద్దాపూర్ పాఠశాలను ఆయన పరిశీలించారు. భోజనశాలను ఇతర వంట సామాగ్రి రూములను ఆయన తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థినిలతో కాసేపు ముచ్చటించారు. తర్వాత వారితో కలిసి భోజనం చేశారు. భోజనం రుచికరంగా ఉండడంతో ప్రిన్సిపాల్ ఇతర ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ రాజేందర్, ప్రిన్సిపాల్ దామెర అనిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పూలే స్ఫూర్తితో చట్టసభల్లో వాటా సాధించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వేల సంవత్సరాల నుంచి విద్యకు, ఆస్తికి, అధికారానికి దూరమైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు స్వాతంత్రం వచ్చి 77 ఏండ్లు అయినప్పటికీ అదే దుస్థితి కొనసాగుతోందని, మహాత్మా జ్యోతిరావు పూలే స్ఫూర్తితో 90 శాతం ఉన్న ప్రజల విముక్తి కోసం ఐక్యంగా పోరాటం చేయాలని ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్, విముక్త చిరుతల కచ్చి పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్, పూలే యువజన సంఘాల సమాఖ్య అధ్యక్షుడు తాడిశెట్టి క్రాంతి కుమార్ పిలుపునిచ్చారు. తెలంగాణ జిల్లాల పూలే యువజన సంఘం, ఆల్ ఇండియా ఓబీసీ జాక్ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కేంద్రంలోని బీఆర్ అంబేద్కర్ సెంటర్ లో గురువారం జరిగిన పూలే 134 వర్ధంతి కార్యక్రమంలో వారు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఓబీసీ జాక్ వైస్ చైర్మన్ పటేల్ వనజ, బుద్ధిస్ట్ సొసైటీ నాయకులు మిద్దేపాక ఎల్లన్న, పబ్లిక్ గార్డెన్ మాజీ అధ్యక్షుడు వల్లాల జగన్ గౌడ్, న్యాయవాదులు యగ్గడి సుందర్ రామ్, మహేందర్, వివిధ సంఘాల నాయకులు తాటికొండ సద్గుణ, సింగారపు అరుణ, జల్లెల కృష్ణమూర్తి, రాజు యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, సురాసి విక్రమ్, నలుబాల రవికుమార్, కర్రే చంద్రశేఖర్, కొండి కృష్ణ గౌడ్, అనిశెట్టి సాయి తేజ, నలుబోల సంజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## డిసెంబర్ 1న దివ్యాంగ ఉద్యోగుల రాష్ట్ర సమ్మేళనం

### సంఘం జిల్లా అధ్యక్షుడు బిల్ల మహేందర్



**వరంగల్ వాయిస్, వడ్డేపల్లి :** హైదరాబాదులోని ప్రకాశ్ హాల్, గాంధీభవన్ ప్రాంగణంలో డిసెంబర్ 1న నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు బిల్ల మహేందర్ పిలుపునిచ్చారు. గురువారం వడ్డేపల్లి 100 ఫీట్ల రోడ్డులోని సమ్మయ్య నగర్ ప్రాథమిక పాఠశాలలో దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన జిల్లా అధ్యక్షులు బిల్ల మహేందర్ మాట్లాడుతూ రాష్ట్ర సంఘం పక్షాన జరగుతున్న ఈ సమ్మేళనంలో దివ్యాంగుల ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై చర్చ జరగుతుందన్నారు. ఇటీవల చైర్మన్ పదవికి ఎంపికైన దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్యకు సన్మాన కార్యక్రమం కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు వివిధ మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులను ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. కావున జిల్లాలోని దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కంచారు. సమావేశంలో సంఘం రాష్ట్ర బాధ్యులు నున్న నరసమ్మ, కోశాధికారి వల్లపురెడ్డి వాసుదేవ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆకవరపు స్వరూప, మహ్మద్ ఫసి ఉద్దీన్, కె.రవీందర్, కడుదుల సోమన్న, వి.నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పూలే ఆశయాలను కొనసాగించాలి



**వరంగల్ వాయిస్ ,టేకుమట్ల :** టేకుమట్ల మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్ గౌడ్ ఆధ్వర్యంలో సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిరావు పూలే 134వ వర్ధంతి సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సతీష్ గౌడ్ మాట్లాడుతూ.. అణగారిన బడుగు, బలహీన వర్గాల చదువుల కోసం జ్యోతిరావు పూలే, ఆయన భార్య సావిత్రిబాయి పూలే స్వయంగా పాఠశాలలను నెలకొల్పి విద్యాబుద్ధులు నేర్పించారని కొనియాడారు. బడుగు బలహీన వర్గాల విద్య కోసం సావిత్రిబాయి పూలే ఎన్నో అవమానాలను భరించారన్నారు. పూలే స్ఫూర్తితోనే డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు హక్కులు కల్పించారని సతీష్ గౌడ్ గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వైనాల రవీందర్, జిల్లా నాయకులు కత్తి సంపత్ గౌడ్, మాజీ ఎంపీటీసీలు సంగీ రవి, పెరుమాండ్ల మొగిలి, మండల నాయకులు కోయ్యల చిరంజీవి, ఎలాబొయిన రాజేందర్, వంగ నరేష్, కోరే చందు,మండల యూత్ అధ్యక్షుడు నూనేటి రమేష్, నాయకులు పాల్గొన్నారు.

## డీఎంహెచ్ఓకు ఘన సన్మానం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** డీఎంహెచ్ఓ కార్యాలయంలో వరంగల్ డీఎంహెచ్ఓగా నూతన బాధ్యతలు తీసుకున్న సందర్భంగా గురువారం డాక్టర్. బి సాంబశివరావునుఅర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ మోహన్ సింగ్, పబ్లిక్ హెల్త్ మేనేజర్ డీ.మోహన్ రావు , వైకుంఠం, మోహన్, జాతీయ అరోగ్య మిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా, ముక్కెర రాజేందర్, కాసుల మాధవి, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## డ్రంకెన్ డ్రైవ్ లో 12మందికి జరిమాన

**వరంగల్ వాయిస్, క్రైం :** వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ జా, ఏసీపీ టి.సత్యనారాయణ పర్యవేక్షణలో డ్రంకెన్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన 13 మందిని మేజిస్ట్రేట్ అబ్బోజు వేంకటేశం ఎదుట హాజరు పరుచగా నాందేడ్ కు చెందిన రాహుల్ కు రెండు రోజుల సామాజిక సేవ శిక్ష పడగా వరంగల్ తహశీల్దార్ వద్దకు పంపించారు. మిగిలిన 12 మందికు రూ.13,700 జరిమానా విధించారు. అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన ఇద్దరిని కోర్టులో హాజరు పర్చగా వారికి రూ.1,500 జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ కె.రామకృష్ణ తెలిపారు.

## మహానుభావుల ఆశయాలను మరువకూడదు



**వరంగల్ వాయిసప్, వరంగల్ :** మహానుభావుల ఆశయాలను, సమాజం కోసం వారు చేసిన త్యాగాలను మరువకూడదని జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి ప్రొఫెసర్ భూక్య బాబురావు అన్నారు. గురువారం వరంగల్ హంటర్ రోడ్డులోని జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో ప్రొఫెసర్ బాబురావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జ్యోతిరావు పూలే వర్ధంతి పురస్కరించుకుని పూలే చిత్రపటానికి పూలు సమర్పించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా. శ్రీమంతుల దామోదర్, డా.చూరేపల్లి రవికుమార్, డా.బాసని సురేష్, అబ్బు గోపాల్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ డా.గంపా సతీష్, సిబ్బంది పరావస్తు విజయలక్ష్మి, సునంద, కస్తూరిబాయి పాల్గొన్నారు.

# పార్టీ విస్తరణకు ప్రజా సంఘాలు కీలకం

## ● మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజా రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా సంఘాలు కీలకమని, ఆ వైపున ఉద్యమించాలని, అదేవిధంగా పార్టీ విస్తరణకు ప్రజా సంఘాలు పనిచేయాలని జనగామ మాజీ ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సీహెచ్ రాజారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ప్రిన్సిపాల్ గా సీపీఐ అనుబంధ ప్రజా సంఘాల స్టడీ సర్కిల్ జరిగింది. ఈ స్టడీ సర్కిల్ లో సీపీఐ–ప్రజా సంఘాలు అనే అంశంపై జనగామ మాజీ ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సీహెచ్ రాజారెడ్డి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో సీపీఐ, ఏఐటీయూసీ, ఏఐఎస్ఎఫ్, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాలు కీలక పాత్ర పోషించి ఉద్యమ పోరాటాలు నిర్వహించాయని, అందులో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఇరవై వేయిల మంది కార్మికులు, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థి లోకం మొత్తం ఉద్యమించాయని తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాటం నడిపిన చరిత్ర సీపీఐదని, ఆ పోరాటంలో అనేక గ్రామాలు విముక్తి పొంది, భూములు పంచపడ్డాయని తెలిపారు. స్వాతంత్ర్య అనంతరం దేశంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీ, ప్రజా సంఘాలు పోరాటాలు చేస్తున్నాయన్నారు. పోరాటాల ద్వారానే ప్రజా సమస్యలు పరిష్కారంకు నోచుకుంటాయని, ఆ ప్రజా పోరాటాలను నిర్మించేందుకు ప్రజా సంఘాలు కీలకమని వారు అన్నారు. దేశ స్వాతంత్రం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా పేదలు పోరాడుతూనే ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కయ్యూనిస్టు పార్టీ విస్తరణకు ప్రజా సంఘాలు కీలకమని, దాంతో పాటు ప్రజా ఉద్యమాలు నిర్మించడంలో ప్రజా సంఘాలు కీలక పాత్ర వహించాలన్నారు. ఈ స్టడీ సర్కిల్ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, రాష్ట్ర సమితి సభ్యులు ఎన్ ఎ.స్టాలిన్, ప్రజా సంఘాల నాయకులు ఉట్కూరు రాములు, మునిగాల భిక్షపతి, బాషబోయిన సంతోష్, మంచాల రమాదేవి, బత్తిని సదానందం, కొట్టెపాక రవి, వేల్పుల సారంగపాణి, జక్కు రాజు గౌడ్, శంకర్ నాయక్, మంచాల తిరుపతి, గడ్డం లలిత, రసమల్ల దీనా, గుంటి రాజేందర్, లావుడ్య రమాదేవి, రసమల్ల కుమార్, భూక్యా స్వరూప, దర్ముల రాంమూర్తి, వేల్పుల చరణ్, సిపతి వినయ్ పాల్గొన్నారు.

# రేపు దీక్ష దివస్ కు ఉదమ్యకారులు తరలి రావాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడానికి తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా నాటి ఉద్యమ నేత నేటి మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టడం వలన మనకు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని వరంగల్ ఉమ్మడి జిల్లాల ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడు మరుపల్ల రవి అన్నారు. గురువారం కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేసిన 2009 నవంబర్ 29 రోజు చేసిన దీక్షకు దిగారు. ఈ నేపథ్యంలో కేసీఆర్ ను అరెస్టు చేసినందుకు నిరసనగా వరంగల్ చౌరస్తాలో బస్సు అద్దాలు పగలగొట్టి రాస్తారోకో చేపడుతున్నసమయంలో ఇంతేజార్ గంజ్ పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు 15 మంది ఉద్యమకారులను పంపారు. వారికి మెజిస్ట్రేట్ 14 రోజులు రిమాండ్ విధించడం వలన 15 మంది ఉద్యమకారులు 29, 30 తేదీలలో జైలు జీవనం గడిపారని తెలిపారు. ఆ జైలు జీవనం గడిపిన ఉద్యమకారులతో ఉర్సులో సమావేశం జరిపి రేపు ఉదయం 9:00 గంటలకు దీక్ష దివస్ కరీమాబాద్ చెట్లోళ్ల గడ్డ వద్ద జరుపుటకు నిర్ణయించామని తెలిపారు. దీక్ష దివస్ లో జైలు జీవనం గడిపిన వారు కూర్చుంటారని, వారికి సంఘీభావం తెలపడానికి ఉద్యమకారులు రావాలని అధ్యక్షుడు మరపల్ల రవి కోరారు. ఈ సమావేశంలో జైలు జీవనం గడిపిన ఉద్యమకారులు దిండిగాల సోమేశ్వర్, ఎం.ప్రమీల దేవి, తాళ్ల ఉమాదేవి, పప్పుల మంజుల, కెంచ ఆనంద్ ఉన్నారు.

# హైదరాబాద్ బస్సును పునరుద్ధరించాలి

## సరిగా నడవని బస్సులతో ఇబ్బందులు

**వరంగల్ వాయిస్, గణపురం :** గణపురం–ములుగు–పరకాల రూటు బస్సులు సరిగా నడవకపోతుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈమధ్య బస్సులు తగ్గించడం వల్ల అన్ని స్టేజిలో అధిక సంఖ్యలో ప్రయాణికులు ఎక్కుతుండగా ఇప్పుడు ఒకసారి వచ్చిన బస్సుతో తీవ్రంగా రద్దీ పెరుగుతుంది. దీంతో వృద్ధులు, చంటి పిల్లల తల్లులు బస్సు ఎక్కలేక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. దీంతో మహిళలు చార్జీలు పెట్టుకొని ప్రయాణించే పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా పరకాల నుంచి రాత్రి వచ్చే హైదరాబాద్ నైట్ హాల్ట్ బస్సు రద్దయింది. గతంలో ప్రతిరోజు తెల్లవారుజామున ఉదయం మొదటి బస్సుగా హైదరాబాద్ బస్సులో ప్రయాణం చేసే సౌకర్యం ఉండేది .ఇప్పుడు ఆ సౌకర్యం లేకపోవడంతో మండలంలో చెల్పూర్, గాంధీనగర్ మినహా అన్ని గ్రామాల రైతులు, ప్రజలు వారి అవసరాల కోసం గాంధీనగర్, చెల్పూర్ గ్రామాలకు వెళ్లి హైదరాబాద్ బస్సు ఎక్కే పరిస్థితి దాపురించింది. దీంతో ఎంతో రద్దీగా ఉండే ఆ బస్సుల్లో సీటు లేకపోయినా సుదీర్ఘం సమయం నిలబడి ప్రయాణించే పరిస్థితి దాపురించింది. ఇకనైనా ఆర్టీసీ మేలుకొని బస్సులు యధావిధిగా సరైన సమయాలలో నడిచే విధంగా, హైదరాబాద్ బస్సును తిరిగి పునరుద్ధరించి పూర్తిగా బస్సుల సౌకర్యాలు కల్పించాలని మండల ప్రజలు ప్రజా ప్రతినిధులను, ఆర్టీసీ అధికారులను కోరుతున్నారు.

# గ్రానైట్ నిర్మాణానికి శంకుస్థాపన



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** కాశిబుగ్గలోని ప్రసిద్ధిగాంచిన రంగనాయక స్వామి దేవాలయంలో గురువారం రంగనాయక స్వామి దేవాలయ ప్రాంగణంలో గుడి చుట్టూ గ్రానైట్ నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో దాత గోషికొండ సుధాకర్, ఆలయ ఈవో ఎన్ వెంకట్రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అంబి సాంబరాజు, దేవాలయ మాజీ అధ్యక్షుడు వంగరి రవి, మాజీ కమిటీ సభ్యులు చిలుపూర్ సురేష్, వీరాటి ప్రకాశ్ రెడ్డి, మౌటం శ్రీనివాస్, వంగరి సమ్మయ్య, రాగుల ప్రసాద్, ఆలయ అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు, సుల్తానా సమ్మక్క, కోలా కవిత, మంచాల సృజన, కూరపాటి రోజా, గడ్డం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ఏబీవీపీ ఆధ్వర్యంలో నిరసన



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ హనుమకొండ జిల్లా ఆధ్వర్యంలో అశోక జంక్షన్ లో నిరసన కార్యక్రమం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కన్వీనర్ ఆరేపల్లి సుజిత్ మాట్లాడుతూ రాష్ట్రంలో గురుకులాల్లో విద్యార్థులు ఫుడ్ పాయిజన్ జరిగి చనిపోతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. గురుకులాలలో చదివే విద్యార్థులు పేద మధ్య తరగతి విద్యార్థులు మాత్రమే ఉంటారని, అలాంటి గురుకులాలలో ఈ రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ పట్టించుకోకుండా ఢిల్లీకి జల్సాలకు అలవాడుపడిందన్నారు. పిట్టల్లా రాలిపోతున్న విద్యార్థులను ఒక్కసారైనా గురుకులాలకు వెళ్లి పరామర్శించిన పాపాన పోలేదన్నారు. దాదాపు 49 మంది విద్యార్థులు గురుకులాల్లో చనిపోయారని తెలిపారు. 308 సార్లు ఫుట్ పాయిజన్ అయితే 886 మందికి అస్వస్థత ఈ కాంగ్రెస్ పాలనలో జరిగిందని తెలిపారు. వెంటనే రాష్ట్ర సర్కారు హాస్టళ్లలో ఫుడ్ పాయిజన్ ఘటనలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు తెలియజేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి తాళ్లపెల్లి అరుణ్, రోహిత్, వివేక్, చరణ్, బన్నీ, తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి



**వరంగల్ వాయిస్, దామెర:** విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలని, లక్ష్యసాధనకు నిరంతరం కృషి చేయాలని తహసీల్దార్ వరలక్ష్మి దేవి అన్నారు. దామెర మండలంలోని లాదెల్ల హరిజన వాడ కాలనీలో గల ప్రాథమిక పాఠశాల, వెంకటాపురంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం తహసీల్దార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.పాఠశాలల్లో వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. వండిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. పాఠశాలల పరిసరాలను పరిశీలించి, పరిశుభ్రతను పాటించాలన్నారు. పిల్లల చదువుకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. చదువుతోనే అభివృద్ధి, సమాజంలో గౌరవమని అన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు సామాన్య శాస్త్రం పాఠాలను ఎమ్మార్వో పిల్లలకు ప్రశ్నలు వేస్తూ సమాధానాలు రాబట్టి ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సంపత్, ప్రధాన ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

# బడుగు, బలహీన వర్గాలకు స్ఫూర్తి ఫూలే

## ● బీసీ నేత బైరి రవికృష్ణ గౌడ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా గురువారం హనుమకొండ ఎస్డీఎల్సీ సెంటర్ లోని సావిత్రి బాయి – జ్యోతిరావు పూలే విగ్రహాల వద్ద బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్ హాజరై జ్యోతిరావు పూలే–సావిత్రిబాయి పూలే విగ్రహాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బైరి రవికృష్ణ గౌడ్ మాట్లాడుతూ కులం పేరుతో తరతరాలుగా అణిచివేతకు గురవుతున్న బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అండగా నిలిచిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని, స్త్రీలకు చదువు ఎంతో అవసరమన్నారు. దేశంలో కులవివక్షకు వ్యతిరేకంగా పోరాడుతూ, దిగువ కులాల ప్రజలకు సమాన హక్కులను పొందడానికి సత్యశోధక్ సమాజ్ ను ఏర్పాటు చేశామని గొప్పవ్యక్తి జ్యోతిరావు పూలే అని అన్నారు. బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ప్రజలు జ్యోతిరావు పూలేను స్ఫూర్తిగా తీసుకొని రాబోయే రోజుల్లో బహుజనులకు రాజ్యాధికారం వచ్చే విధంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చంద మల్లయ్య, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాడి మల్లయ్య యాదవ్, బచ్చు ఆనందం, బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్ల సంపత్ కుమార్, కాకతీయ యూనివర్సిటీ ఈసీ నెంబర్ డాక్టర్ చిర్ర రాజు గౌడ్, బీసీ విద్యార్థి సంఘం కేయూ ఇంచార్జి ఆరేగంటి నాగరాజు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కాసగాని అశోక్ గౌడ్, జిల్లా కార్యదర్శి పెరుమాండ్ల అనిల్, మధు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# చివరి రోజు చాలా బాధపడ్డాను.



### టీం అందరినీ మిస్ అవుతున్నా : రష్మిక

పుష్ప–2' షూటింగ్‌ను గత సోమవారం రోజున ముగించిన విషయం తెలిసిందే. దాదాపు రెండు సంవత్సరాలుగా సాగిన షూటింగ్‌కు ఆ రోజు గుమ్మడికాయ కొట్టేశారు. ఈ నేపథ్యంలో ఈ సినిమా షూటింగ్ తాలూకు జ్ఞాపకాలను తలచుకొని ఉద్వేగానికి గురైంది కథానాయిక రష్మిక మందన్న. షూటింగ్ చివరి రోజు ఇక తాను సెట్‌లోకి రాలేనని తెలిసి ఎమోషనల్‌గా ఫీలయ్యానని రష్మిక మందన్న తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో పేర్కొంది. 'నవంబర్ 25 నా జీవితంలో భావోద్వేగభరితమైన రోజు. షూటింగ్ చివరి రోజు అని తెలిసి చాలా బాధపడ్డాను. ఆఖరి రోజు ఓ స్పెషల్‌సాంగ్ షూట్ చేశాం. రాత్రి వరకూ సెట్‌లోనే ఉన్నా. గత ఐదేళ్లుగా ఈ టీమ్‌తో కలిసి ప్రయాణం చేస్తున్నా కాబట్టి అది సెట్‌లాగా అనిపించలేదు. అప్పటివరకు సినిమా కోసం పడిన కష్టం, షూట్ సమయంలోని ఎన్నో జ్ఞాపకాలు ఒక్కసారిగా కళ్లముందు కదలాడాయి. షూటింగ్ పూర్తయిందనే సంతోషం ఓ వైపు, సెట్‌ను విడిచిపోతున్నానే బాధ మరో వైపు..ఇలా ఎన్నో భావోద్వేగాలతో నా మనసు నిండిపోయింది. టీమ్ అందరిని మిస్ అవుతున్నాననే బాధతో ఒక్కసారిగా కన్నీళ్లొచ్చాయి. అలా ఎందుకు ఫీల్ అయ్యానో అర్థం కాలేదు. గొప్ప టీమ్‌తో పనిచేసినప్పుడు వారితో తెలియని అనుబంధం ఏర్పడుతుంది. ఆ ఫీలింగే నన్ను కదిలించింది' అని రష్మిక తన పోస్ట్‌లో పేర్కొంది.



## ఆ ట్యాగ్ ఇచ్చింది మీరే..!

'పుష్ప–2 ది రూల్' మూవీ ప్రమోషన్స్ యమా జోరుగా సాగుతున్నాయి. భారతదేశంతో పాటు ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులు ఎదురుచూస్తున్న ఈ చిత్రంపై ఓ రేంజ్‌లో అంచనాలు నెలకొని ఉన్నాయి. ఇండియాస్ బిగ్గెస్ట్ ఫిలింగా రూపొందిన ఈ చిత్రంలో ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్ నట విశ్వరూపం చూసేందుకు అంతా సిద్ధమవ్వండి అంటూ చిత్రయూనిట్ సైతం చెబుతోంది. బ్రిలియంట్ డైరెక్టర్ సుకుమార్ దర్శకత్వ ప్రతిభ, ఆయన క్లాస్ టేకింగ్‌తో ఈ చిత్రం బ్లాక్‌బస్టర్ చిత్రంగా నిలవడమే కాకుండా.. మరిన్ని అవార్డులను తెచ్చిపెడుతుందని అంతా భావిస్తున్నారు. ఈ సినిమాను సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్ నిర్మాతలు. డిసెంబరు 5న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కాబోతుంది. ఇప్పటికే బీహార్‌లోని పాట్నాలో జరిగిన 'పుష్ప–2' ట్రైలర్ లాంచ్ వేడుక ఇండియా మొత్తం హాట్‌టాపిక్‌గా నిలవగా.. చెన్నయ్‌లో జరిగిన వైల్డ్ ఫైర్ ఈవెంట్ గ్రాండ్ సక్సెస్‌గా నిలిచింది. ఐకాన్ స్టార్ ఎక్కడికి వెళితే అక్కడ ఆయన అభిమానులు గ్రాండ్ వెల్‌కమ్ చెబుతున్నారు. తాజాగా ఈ చిత్రం మరో గ్రాండ్ ఈవెంట్ కేరళలోని కొచ్చిలో ఎంతో ఘనంగా నిర్వహించారు మేకర్స్. కేరళలో మల్లు అర్జున్‌గా అత్యధిక అభిమానులు ఉన్న తెలుగు హీరోగా పేరున్న అల్లు అర్జున్‌కు అక్కడ అశేష జనాదరణ లభించింది. ఐకాన్ స్టార్ కోసం ఈ వేడుకకు భారీగా జనాలు తరలి రావడం విశేషం. ఇక ఈ కార్యక్రమంలో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మాట్లాడుతూ.. థ్యాంక్యూ కేరళ. మీ అడాప్టెడ్ సన్ మల్లు అర్జున్‌కు మీరిచ్చిన ఈ గ్రాండ్ వెలకమ్ మరిచిపోలేను. గత 20 ఏళ్ల నుంచి మీరు నాపై ప్రేమ చూపిస్తున్నారు. ఈ సినిమా నా కెరీర్‌లో చాలా ప్రత్యేకం. ఈ చిత్రంలో మలయాళ గొప్ప నటుడు ఫహద్ ఫాజిల్‌తో పనిచేయడం ఆనందంగా వుంది. ఈ సినిమాలో ఆయన నటన చూసి మీరంతా గర్వపడతారు. నా సినిమా కోసం మీరు మూడేళ్లుగా వెయిట్ చేస్తున్నారని తెలుసు. ఈ సినిమాలో రష్మికా తన నటనతో మెప్పిస్తుంది. రష్మికతో పనిచేయడం ఎంతో కంఫర్ట్‌గా అనిపించింది. సుకుమార్ నా కెరీర్‌లో 'ఆర్య'ను ఇచ్చాడు. 'ఆర్య' చిత్రంతోనే నా మార్కెట్ కేరళలో స్టార్ట్ అయ్యింది. దర్శకుడు సుకుమార్ వల్లే నేను మీకు దగ్గరయ్యాను. నా కెరీర్‌లో దేవి శ్రీప్రసాద్ ఎన్నో సూపర్‌హిట్ సాంగ్స్ ఇచ్చాడు. నా చిత్రానికి పనిచేసిన మలయాళీ రైటర్స్ అందరికీ కూడా చాలా థ్యాంక్స్. మైత్రీ నవీన్, రవి, చెర్రీల సపోర్ట్ వల్ల ఈ సినిమా సాధ్యమైంది.



## ధనుష్, ఐశ్వర్యలకు విడాకులు మంజూరు

తమిళ స్టార్ హీరో ధనుష్, సూపర్ స్టార్ రజనీకాంత్ కూతురు ఐశ్వర్య రజనీకాంత్‌కు విడాకులు మంజూరయ్యాయి. ఈ జంటకు చెన్నై ఫ్యామిలీ కోర్టు విడాకులు మంజూరు చేసింది. ధనుష్–ఐశ్వర్య జంట తాము విడిపోతున్నట్లు 2022 జనవరిలో ప్రకటించిన విషయం తెలిసిందే. 18 ఏళ్ల బంధానికి ముగింపు పలుకుతున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఇద్దరూ సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. తాజాగా ఇద్దరికీ విడాకులు మంజూరు చేస్తూ తీర్పు వెలువరించింది. సూపర్ స్టార్ రజనీకాంత్ పెద్దకుమార్తె అయిన ఐశ్వర్య.. 2004 నవంబర్ 18న ధనుష్‌ను వివాహం చేసుకుంది. వీరికి యాత్ర, లింగ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. గత రెండేళ్లుగా వీరిద్దరూ విడివిడిగా జీవిస్తున్నారుప్రస్తుతం ఇద్దరు పిల్లలూ ఐశ్వర్య వద్దే ఉంటున్నారు.



## పారడైజ్‌తో ముందుకొస్తున్న నాని

### మోహన్‌బాబు, నానిల మధ్య రసవత్తర సన్నివేశాలు

సరిపోదా శనివారం సినిమా సక్సెస్‌తో ఫుల్ జోష్ మీదున్నాడు టాలీవుడ్ న్యాచురల్ స్టార్ నాని. వీటిలో మోస్ట్ ఎవెయిటెడ్ ప్రాజెక్ట్ దసరా డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో ది ప్యారడైజ్ టైటిల్ లుక్ విడుదల చేయగా.. నెట్టింట వైరల్ అవుతోంది. ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌లో దసరా ఫేం సుధాకర్ చెరుకూరి తెరకెక్కిస్తున్న ఈ మూవీకి సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి అభిమానులను ఫుల్ ఖుషీ చేస్తోంది. ఈ చిత్రంలో కలెక్షన్ కింగ్ మోహన్ బాబు మెయిన్ విలన్‌గా కనిపించబోతున్నాడట. అంతేకాదు మరో పాపులర్ తెలుగు యాక్టర్ కీ రోల్‌లో నటిస్తున్నాడని ఇన్‌సైడ్ టాక్. ఇంతకీ ఎవరా నటుడనేది ప్రస్తుతానికి సస్పెన్స్ నెలకొంది. ఇదే నిజమైతే సిల్వర్ స్క్రీన్‌పై మోహన్ బాబు–నాని పోరు ఎలా ఉండబోతున్నది సర్వత్రా ఉత్కంఠ రేకెత్తిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. హై ఎనర్జిటిక్ యాక్షన్ ప్యాక్‌డ్ రోల్‌లో కనిపించబోతున్నాడట.



## ఓటీటీలో కిరణ్ అబ్బవరం 'క'

టాలీవుడ్ యువ హీరో కిరణ్ అబ్బవరం రీసెంట్‌గా క సినిమాతో ప్రేక్షకులను పలుకరించాడని తెలిసిందే. 1970 ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణగిరి గ్రామం నేపథ్యంలో సాగే పీరియాడిక్ థ్రిల్లర్‌గా పాన్ ఇండియా కథాంశంతో వచ్చిన ఈ చిత్రం ఈ మూవీ తెలుగు, తమిళంతోపాటు పాన్ ఇండియా స్థాయిలో గ్రాండ్‌గా రిలీజై హిట్ టాక్ తెచ్చుకుంది. ఈ మూవీని థియేటర్లలో మిస్సయిన వారి కోసం డిజిటల్ ఎంట్రీ అప్‌డేట్ వచ్చేసింది. ప్రస్తుతం క పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం ఈటీవీ విన్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. ప్రేక్షకులకు అద్భుతమైన విజువల్ ఎక్స్‌పీరియన్స్ అందించేందుకు క డాల్బీ విజన్‌లో సందడి చేస్తుండటం విశేషం. ఈటీవీ విన్‌లో డాల్బీ విజన్‌లో స్ట్రీమింగ్ అవుతున్న తొలి సినిమాగా అరుదైన ఫీట్ నమోదు చేసింది క. ఇంకేంటి మరి డాల్బీ విజన్‌లో మీరూ చూసేయండి. సుజిత్–సందీప్ డైరెక్ట్ చేసిన ఈ చిత్రంలో 2018 ఫేం తాన్వి రామ్, గం గం గణేశా ఫేం నయన్ సారిక ఫీ మేల్ లీడ్ రోల్స్ పోషించారు. వరలక్ష్మి సమర్పణలో శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై తెరకెక్కించిన ఈ మూవీకి శ్యామ్ సీఎస్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందించాడు.



# కేయూ అభివృద్ధికి కృషి

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని
- యూనివర్సిటీ సామాజిక విభాగం ఆధ్వర్యంలో సెమినార్

**వరంగల్ వాయిస్, కేయూ :** మానవ సంబంధాలు దూరం అవుతున్న ప్రస్తుత తరుణంలో కాలపరమైన బోధన, పరివార్తన పట్ల ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. సమాకాలిన ప్రపంచంలో మారుతున్న నవీన కాలానికి అనుగుణంగా పరివర్తన ఉండాలని కోరారు. సమకాలీన భారతదేశంలో సామాజిక సంస్థల ద్వారా ప్రపంచీకరణ, అభివృద్ధి, సామాజిక పరివర్తనపై కాకతీయ యూనివర్సిటీలో సామజిక విభాగ ఆధ్వర్యంలో సెనట్ హల్ లో గురువారం నిర్వహించిన సెమినార్ కి నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాకతీయ యూనివర్సిటీ పక్షాలనపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. గతంలో కంటే అన్ని రంగాల్లో యూనివర్సిటీ అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం దోహదడుతుందన్నారు. అన్ని వయస్సుల వారి జీవన శైలి ప్రమాణలపట్ల అధ్యయనాలు చేయాలన్నారు. మహాత్మా జ్యోతిబా పూలే వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కేయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.ప్రతాప్ రెడ్డి, ప్రొఫెసర్లు వెంకట నారాయణ, ఘంటా చక్రపాణి, గణేష్, ఉమామోహన్, హనుమంత్ రావు, మనోహర్, మల్లిఖార్జున రెడ్డి, రాములు, ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, ఎంపి.ఆనంద్, బోడ డిన్న, యూనివర్సిటీ విద్యార్థి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఫుడ్ పాయిజన్ వెనుక.. రాజకీయ కుట్ర

- వరుస ఘటనల బాధ్యులను త్వరలోనే గుర్తిస్తాం
- అధికారుల ప్రమేయం ఉంటే ఉద్యోగం ఊస్ట్
- మంత్రి సీతక్క సంచలన వ్యాఖ్యలు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరుస ఫుడ్ పాయిజన్ ఘటనల వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటనలకు ఓ రాజకీయ పార్టీ కారణమని అనుమానంగా ఉందన్నారు. దీనిపై పూర్తి స్థాయి విచారణ జరుగుతుందన్నారు. కుట్రలు ఎవరు చేశారనే విషయాన్ని త్వరలోనే నిగ్గు తేలుస్తామన్నారు. అన్ని విషయాలను ఆధారాలతో బయట పెడతామన్నారు. హాస్టళ్లలో ఉన్నవారితో లింకులు పెట్టుకొని ఏం చేస్తున్నారో కూడా బహిరంగంగా తెలియజేస్తామన్నారు. అయితే కుట్రల వెనుక ఎంతటి పెద్దవారు ఉన్నా ఉపేక్షించేంది లేదన్నారు. ఒకవేళ కుట్రదారులకు ఉద్యోగులు, అధికారులు సహకరించి ఉంటే వారిని నిర్ధాక్షిణ్యంగా ఉద్యోగంనుంచి తొలగించడంతోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సీతక్క చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారాయి.



# గంజాయిని దహనం చేసిన పోలీసులు

## దీని విలువ రూ.1.33 కోట్లు

**వరంగల్ వాయిస్, క్రైం :** తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో డైరెక్టర్ ఆదేశాల మేరకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ కేసుల్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న సుమారు రూ.1.33 కోట్ల విలువైన 535కిలోల గంజాయిని ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్, అదనపు డీసీపీ రవి పర్యవేక్షణలో గురువారం దహనం చేశారు. హనుమకొండ జిల్లా, కాజీపేట మండలం అమ్మవారిపేట శివారు ప్రాంతంలోని కాకతీయ మెడిక్లీన్ సర్వీస్ పరిశ్రమలోని బాయిలర్ లో పట్టుబడిన గంజాయిని వేయడంతో అది పూర్తిగా దహనమైంది. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఎస్సై రాజుతో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఏసీబీ వలలో పీఆర్ ఏఈ


## రూ.5 వేల లంచం పుచ్చుకుంటూ అడ్డంగా బుక్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** అవినీతి నిరోధక శాఖ అధికారులు దూకుడు పెంచారు. ప్రభుత్వ శాఖల్లో లంచావతారుల భరతం పడుతున్నారు. అందులో భాగంగానే గురువారం వరంగల్ లో లంచం తీసుకుంటున్న పంచాయతీరాజ్ ఇంజినీర్ ను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. వరంగల్ జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ గా పని చేస్తున్న కార్తీక్ రూ.5 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. కాంట్రాక్టు బిల్లుల ఫైల్ క్లియరెన్స్ కోసం వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం కడారిగూడెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సతీష్ ను ఏఈ కార్తీక్ డబ్బు డిమాండ్ చేశారు. దీంతో సతీష్ ఏసీబీ అధికారులను ఆశ్రయించగా గురువారం హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్ వద్ద పథకం ప్రకారం కార్తీక్ ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం హనుమకొండలోని వరంగల్ జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు విచారణ చేపట్టారు.



# అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ 7వ శాఖ ప్రారంభం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గ్రేటర్ వరంగల్ పరిధిలోని 56వ డివిజన్ గోపాల్ పూర్–జవహర్ కాలనీ–కోమటిపల్లి మెయిన్ రోడ్ లో నూతనంగా ఏర్పాటు చేసిన వరంగల్ అర్బన్ కో–ఆపరేటివ్ బ్యాంగ్ ఏడో శాఖను డీసీఓ ఎం.నీరజ, మాజీ పార్లమెంట్ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంత్ రావు గురువారం లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వరంగల్ అర్బన్ కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగంలో వరంగల్ అర్బన్ కో–ఆపరేటివ్ బ్యాంక్ అగ్రగామిగా నిలుస్తోందన్నారు. 1994 లో ఆవిర్భవించిన ఈ బ్యాంకు ఇప్పటి వరకు రూ.400 కోట్ల టర్నోవర్ పూర్తి చేసుకొందన్నారు. త్వరలో మహబూబాబాద్, జనగామ, వడ్డేపల్లిలో నూతన బ్యాంక్ శాఖలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వి.సతీష్ కుమార్, కో–ఆపరేటివ్ అధికారి జగన్ మోహన్ రావు, బ్యాంకు వైస్ చైర్మన్ తోట జగన్నాథం, బ్యాంకు ఫౌండర్, డైరెక్టర్ బూర ముత్తిలింగం, బ్యాంకు డైరెక్టర్లు డాక్టర్ వి.పవన్ కుమార్, పొన్న హరినాథ్, ఎండి.గౌసుద్దీన్, మందా స్వప్న శ్రీనివాస్, కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి, బ్యాంకు సీఈఓ సత్యనారాయణ రావు, బ్యాంకు సిబ్బంది, వ్యాపార ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



# వివరాలు పక్కాగా ఎంట్రీ చేయాలి

## హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**వరంగల్ వాయిస్, ఆత్మకూరు, దామెర :** సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాల నమోదులో భాగంగా ఎన్యుమరేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు నమోదు చేసిన అన్ని వివరాలు సమగ్రంగా ఉన్నాయా లేదా సరి చూసుకున్న తర్వాతే ఫైనల్ సబ్మిట్ చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సూచించారు. గురువారం హనుమకొండ జిల్లా గూడెప్పాడు విట్స్ కళాశాలలో సర్వే వివరాల నమోదు చేసేందుకు ఏర్పాటు చేసిన డేటా ఎంట్రీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. దామెర, శాయంపేట, ఆత్మకూరు మండలాలకు సంబంధించిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాలను ఎన్యుమరేటర్ల సహకారంతో డేటా ఎంట్రీ ఆపరేటర్లు నమోదు చేస్తుండగా కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పరకాల ఆర్డీవో డాక్టర్ కె.నారాయణ, ఆత్మకూరు మండల ప్రత్యేక అధికారి రాజేందర్, తహసీల్దార్లు జగన్మోహన్ రెడ్డి, భాస్కర్, ఎంపీడీఓలు శ్రీనివాస్ రెడ్డి, ఫణి చంద్ర, ఎంపీవోలు, ఎంపీఎస్వోలు, ఎన్యుమరైటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



# ఫూలేకు కేటీఆర్ నివాళులు

మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా గురువారం హైదరాబాద్ లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు, శాసన మండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, ఇతర సీనియర్ నేతలతో కలిసి ఆ మహనీయుని చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.

–వరంగల్ వాయిస్, హైదరాబాద్

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com